క్లుప్తంగా

ప్రీమియంపై జీఎస్టీ తొలగింపుతో మేలు



మాట్లాడుతున్న రాజశేఖర్

నెల్లూరు(అర్బన్): ఎల్ఐసీ ప్రీమియంపై జీఎస్టీని కేంద్ర ప్రభుత్వం తొలగించడంతో పాలసీదారులకు ఎంతో మేలు జరుగుతుందని ఎల్ఐసీ ఏఓఐ యూనియన్ ఏపీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజశేఖర్ పేర్కొన్నారు. హరనాథపురంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో ఏజెంట్లతో ఆత్మీయ సభను యూనియన్ డివిజన్ ప్రధాన కార్యదర్శి నరసింహారావు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడారు. జీఎస్టీ తొలగింపుతో భారం తగ్గడమే కాకుండా భవిష్యత్తులో బీమా చేసుకునే వారి సంఖ్యా పెరుగుతుందని చెప్పారు. డివిజన్ కోశాధికారి ధనుంజయ, హజరత్‌రెడ్డి పాల్గొన్నారు.

వెంకయ్యస్వామి సన్నిధికి భక్తుల పాదయాత్ర



నెల్లూరు(బృందావనం): గొలగమూడిలోని వెంకయ్యస్వామి సన్నిధికి పాదయాత్రను భక్తులు ఆదివారం చేపట్టారు. బాలాజీనగర్ సమీపంలోని సాయిదర్బార్ అద్దాల మందిరం నుంచి ప్రారంభమైన పాదయాత్రకు 350 మందికి పైగా సాయిభక్తులు హాజరయ్యారు. అనంతరం సాయిదర్బార్ అద్దాల మందిర తరఫున వెంకయ్యస్వామికి పట్టు వస్త్రాలు, పూలమాలలు తదితరాలను సమర్పించారు. మందిర చైర్మన్ మధుసాయి, గౌరవ సలహాదారు పాబోలు రామసుబ్బయ్య పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీ హోమం




నెల్లూరు(బృందావనం): భాద్రపద పౌర్ణమిని పురస్కరించుకొని మూలాపేటలోని శంకరమఠంలో చండీ హోమాన్ని భక్తిశ్రద్ధలతో ఆదివారం నిర్వహించారు. కంచికామకోటి పీఠానికి చెందిన వేదపండితులతో నిర్వహించిన హోమానికి భక్తులు విశేషంగా హాజరయ్యారు. మఠం ప్రాంగణంలోని కామాక్షి సమేత చంద్రమౌళీశ్వరస్వామి, చండీమాతను దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఉభయకర్తలుగా గంటి జగన్నాథం దంపతులు వ్యవహరించారు. మఠం నిర్వాహకులు కొప్రపాటి నందకిశోర్, ఉషాకుమారి దంపతులు పర్యవేక్షించారు.

దివ్యాంగ ఉపాధ్యాయులకు అభినందన



నెల్లూరు(బృందావనం): జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని టీవీఎస్ కల్యాణ సదన్‌లో 50 మంది దివ్యాంగ ఉపాధ్యాయులకు సన్మాన సభను సక్షమ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. వీఆర్ కళాశాల పూర్వ ప్రిన్సిపల్ అశోక్‌కుమార్, వీఎస్‌యూ ఆంగ్ల శాఖాధిపతి భగవాన్, ఆర్ఎస్ఎస్ సేవా ప్రముఖ్ మల్లికార్జునరెడ్డి, సక్షమ్ జిల్లా కార్యదర్శి రంగయ్య, జ్యోతిర్మయి, చెంచురెడ్డి, వేణుగోపాల్, మల్లికార్జున్, హరిబాబు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పవిత్రోత్సవాలు



నెల్లూరు(బృందావనం): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. నిత్య హోమాలు, పూర్ణాహుతి, తిరుమంజనం, గోపురోత్సవం, మహాకుంభప్రోక్షణ తదితరాలను నిర్వహించారు. ఉభయకర్తలుగా పోలూరు సుబ్బయ్య, పద్మావతి దంపతులు వ్యవహరించారు. ఈఓ ఆళ్ల శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేలా చర్యలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విజయవాడలో ఈ నెల 13న సమావేశాన్ని కార్మిక, కర్షక కాంగ్రెస్ కమిటీ జాతీయ అధ్యక్షుడు ఉదిత్‌రాజ్ నిర్వహించనున్నారని, ఇందులో ఆర్టీసీ విశ్రాంత కార్మికుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నామని కేకేసీ కమిటీ జిల్లా అధ్యక్షుడు వీరపరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని ఇందిరా భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆదివారం ఆయన మాట్లాడారు. ఆర్టీసీలో పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన వారికి బెనిఫిట్స్ సక్రమంగా అందడంలేదని చెప్పారు. రైతులు, అసంఘటిత కార్మికులు ఇలా అందరూ ఇబ్బందులు పడుతూనే ఉన్నారని తెలిపారు.

కండలేరులో నీటి నిల్వలు పైపైకి..

- కాలువలకు గ్రావిటీ ద్వారా అందుతున్న నీరు
- 41 టీఎంసీలకు పైగా జలాశయంలో నీరు
- పంపింగ్ స్కీమ్ నిలిపివేత
- జాడలేని వాన



కండలేరు జలాశయం

పొదలకూరు: కండలేరు జలాశయంలో రోజురోజుకూ నీటి నిల్వ పెరుగుతోంది. సోమశిల నుంచి 10 వేల క్యూసెక్కుల నీరు ఫ్లడ్ ఫ్లో కెనాల్ ద్వారా వచ్చి చేరుతుండటంతో 41 టీఎంసీల పైగా నీరు వచ్చి చేరింది. 21 టీఎంసీలు ఉండగా మరో 20 టీఎంసీలు పెరిగాయి. ఈ రబీలో 55 టీఎంసీలకు పైబడి నీటిని నిల్వ చేసే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు. కండలేరులో పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 68 టీఎంసీలు. అయితే మట్టికట్ట కావడంతో ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో నీటిని నిల్వ చేసింది లేదు. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 55 టీఎంసీలను ఉంచారు. తర్వాత మరో సందర్భంలో 50 టీఎంసీలకు పైబడి నీటిని నిల్వ చేయగా సమయంలో చుట్టుపక్కల గ్రామస్తులు భయాందోళనలకు గురైన సందర్భాలున్నాయి. అయితే జలాశయానికి స్పిల్‌వే (పొర్లు కట్ట లేదా రిజర్వాయర్లలో అదనపు నీటిని సురక్షితంగా బయటకు పంపడం)ను నిర్మించారు. ప్రస్తుతం స్పిల్‌వే గుండా నీటిని పంపేందుకు అటవీ అనుమతి లేక కాలువ నిర్మాణం పనులు నిలిచిపోవడంతో పూర్తి స్థాయిలో నీరు ఉంచే పరిస్థితి లేదు.

ఎడమ కాలువకు..

కండలేరులో 29 టీఎంసీలు దాటిన తర్వాత ఎడమగుట్టు కాలువకు గ్రావిటీ ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు. అంతకుముందు ఎత్తిపోతల పథకం ద్వారా కాలువకు నీటిని విడుదల చేస్తున్న అధికారులు జలాశయంలో నీటి నిల్వలు పెరుగుతున్న నేపథ్యంలో ఎత్తిపోతలను నిలిపివేసి గ్రావిటీ ద్వారా కాలువకు సాగునీటిని అందిస్తున్నారు. ఎడమ కాలువ ద్వారా పొదలకూరు మండలంలో మెట్ట పంటలు పండుతున్నాయి. జలాశయంలో 55 టీఎంసీలు నీటిని నిల్వ చేస్తే రబీ వరిసాగుకు ఢోకా ఉండదని అభిప్రాయపడుతున్నారు. కాలువ ద్వారా 32 చెరువులను నింపేందుకు అవకాశం ఉంది. చేజర్ల మండలంలో కూడా రెండు పంచాయతీల్లో గ్రామాలకు ఎడమ కాలువ ద్వారా సాగునీటిని అందిస్తున్నారు.

చినుకు జాడేదీ?

పైతట్టు ప్రాంతాల నుంచి వరద నీరు వచ్చి ప్రాజెక్టులు నిండుతున్నా ఈ ప్రాంతంలో చినుకు జాడలేకుండా పోయింది. ఎడమ కాలువ ద్వారా నీరు అందినా మెట్టప్రాంతాల్లో నిమ్మతోటలకు కాలువ నీటిని రైతులు పెట్టుకోరు. అలా చేస్తే తెగుళ్లు విపరీతంగా పెరుగుతాయని చెబుతుంటారు. తోటల్లో బోర్ల నుంచి అందే నీటినే నిమ్మతోటలకు అందిస్తారు. వర్షం ముఖం చాటేయడంతో అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు. కాలువ నీటి వల్ల భూగర్భ జలాలున్నా సకాలంలో వర్షం కురిస్తే మెట్టపంటలను సాగు చేసేందుకు అవకాశం ఉంటుందని వెల్లడిస్తున్నారు.



చుక్కనీరు లేక ఎండిపోయిన చెరువు

కాకాణి గోవర్ధన్‌రెడ్డి పర్యటన



వివరాలు తెలుసుకుంటున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం: మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదివారం మండలంలోని ఇస్కపాళెం గ్రామంలో పర్యటించారు. ఎంపీటీసీ సభ్యుడు చిట్టమూరు శివకుమార్‌రెడ్డికి చెందిన గడ్డివామి అగ్ని ప్రమాదానికి గురికావడంతో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఎంత మేరకు నష్టం జరిగిందో అడిగి తెలుసుకున్నారు. అలాగే గ్రామానికి చెందిన చిట్టమూరు వెంకురెడ్డి మృతిచెందడంతో ఆయన నివాసానికి వెళ్లి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. కాకాణి వెంట వైస్ ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య, మండల కన్వీనర్ కొణిదెన మోహన్‌నాయుడు, నాయకులు కొణిదెన విజయభాస్కర్‌నాయుడు, కిశోర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొట్టెంపాడులో..

ముత్తుకూరు(పొదలకూరు): మండలంలోని పొట్టెంపాడు గ్రామంలో మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆయన్ను కలిశారు. గ్రామానికి చెందిన పార్టీ నాయకుడు పల్లంరెడ్డి జనార్దనరెడ్డి సతీమణి విజితమ్మ అనారోగ్యానికి గురైన సమాచారం తెలుసుకుని ఆమెను పరామర్శించారు. కాకాణి వెంట మండల పార్టీ అధ్యక్షుడు మెట్ట విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులున్నారు.



నేతలు, కార్యకర్తలకు అభివాదం చేస్తున్న కాకాణి

అభినయంతో బోధన.. ఆనందదాయక అభ్యసన

కొడవలూరు: అభినయంతో బోధన.. ఆనందదాయక అభ్యసన పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని గండవరం ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి విద్యార్థులకు ఆదివారం నిర్వహించారు. హిందీ పాఠ్యపుస్తకంలోని బారిష్ అనే అంశాన్ని అభినయం ద్వారా హిందీ పండిట్ నాగభూషణం వివరించారు. ఈ సందర్భంగా హెచ్ఎం లక్ష్మీకాంతం మాట్లాడారు. బోధనను ఈ – కంటెంట్‌గా రూపొందించి ఆన్‌లైన్లో పొందుపర్చనున్నామని, ఇది ఎంతో మందికి ఉపయోగపడుతుందని చెప్పారు.



ప్రత్యేక తరగతికి హాజరైన విద్యార్థులతో హెచ్ఎం, హిందీ పండిట్

ఐక్య ఉద్యమాలకు సిద్ధంకండి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసిస్తూ కార్మిక వర్గాన్ని ఐక్యం చేసి ఉద్యమాలు చేసే సమయం ఆసన్నమైందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ పేర్కొన్నారు. వేదాయపాళెంలోని ఓ కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన సీఐటీయూ నెల్లూరు రూరల్ మహాసభలో ఆయన మాట్లాడారు. 44 కార్మిక చట్టాలను రద్దు చేసి కార్పొరేట్ సంస్థలకు కార్మికులను బానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోడ్లను కేంద్రం తీసుకొస్తోందని ఆరోపించారు. రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేస్తున్నా, ప్రధాని మోదీని సీఎం చంద్రబాబు ప్రశ్నించకపోవటం సిగ్గుచేటని విమర్శించారు. కరేడులో పేద రైతుల భూములకు కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేస్తున్నారని ధ్వజమెత్తారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా సుధాకర్, పెంచలనరసయ్య, కోశాధికారిగా భాజావలీ ఎన్నికయ్యారు. మాదాల వెంకటేశ్వర్లు, కొండా ప్రసాద్, నరసింహారెడ్డి, శివాజీ, దేశమూర్తి, సుజాతమ్మ, అంజిరెడ్డి, సందానీబాషా, సంపత్‌కుమార్, మాలకొండయ్య తదితరులు, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రసాద్



భారీ ర్యాలీ

సీఐటీయూ నెల్లూరు రూరల్ మహాసభ ముగింపును పురస్కరించుకొని వేదాయపాళెం నుంచి అయ్యప్పగుడి సెంటర్ వరకు భారీ ర్యాలీని నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం

నెల్లూరు(అర్బన్): నగరంలోని పిన్నంరాజువారి వీధికి చెందిన యేనుగుల విజయలక్ష్మి (60) తన నివాసంలో ఆదివారం మృతి చెందారు. ఈ క్రమంలో ఆమె నేత్రాలను ప్రభుత్వ పెద్దాస్పత్రికి స్థానికులు రాంబాబు, వెంకటేష్, సంతోష్ సహకారంతో కుటుంబ సభ్యుడు రాధాకృష్ణ దానం చేశారు.

⇨ నగరంలోని ఐదు లాంతర్ల సెంటర్‌కు చెందిన కర్నాటి వెంకటసుబ్బారావు (67) తన నివాసంలో మృతి చెందారు. ఆయన నేత్రాలను ప్రభుత్వాస్పత్రికి రెడ్‌క్రాస్ ఎమ్సీ మెంబర్ శ్రీవాణి, వాసవీ వనిత లెజెండ్ ప్రెసిడెంట్ దుగ్గిశెట్టి హేమలత ప్రోత్సాహంతో కుటుంబసభ్యురాలు నీరజాక్షి దానం చేశారు. వీరి నేత్రాలను టెక్నీషియన్ సునీల్ సేకరించి కుటుంబసభ్యులకు సర్టిఫికెట్లను అందజేశారు. నేత్రదానం చేయాలనుకునే వారు 99595 89321, 99124 70094 నంబర్లను సంప్రదించాలని కోరారు.

విజయలక్ష్మి, వెంకటసుబ్బారావు (ఫైల్)

కసుమూరులో భక్తుల ప్రార్థనలు

వెంకటాచలం: మండలంలోని కసుమూరు దర్గాలో ఆదివారం భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున రావడంతో దర్గా ప్రాంగణం సందడిగా మారింది.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

పొదలకూరు: మండలంలోని సోమశిల మార్గం కనుపర్తి క్రాస్‌రోడ్డు వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని గురవాయపాళెం ఎస్సీ కాలనీకి చెందిన బిరదవోలు ప్రసాద్ గ్రామం నుంచి మోటార్‌బైక్‌పై సమీపంలోని వనంతోపు సెంటర్‌కు వెళ్తున్నాడు. చేజర్ల మండలం గాలిపాళెం నుంచి కట్టెల లోడుతో పొదలకూరు వైపు వస్తున్న ట్రాక్టర్, ప్రసాద్ బైక్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ప్రసాద్ కాలు నుజ్జునుజ్జు అయ్యింది. సమాచారం తెలుసుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించారు.

'అన్నదాత పోరు'ను విజయవంతం చేయండి

కోవూరు: రైతులపై కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని నిరసిస్తూ.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు నెల్లూరులో మంగళవారం నిర్వహించనున్న అన్నదాత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పలువురు పిలుపునిచ్చారు. ఈ మేరకు పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామిరెడ్డి మల్లికార్జునరెడ్డి, మండల కన్వీనర్ అత్తిపల్లి అనూప్‌రెడ్డి, జిల్లా ప్రచార కమిటీ సభ్యుడు చేజర్ల సుధాకర్‌రెడ్డి వేర్వేరు ప్రకటనలను ఆదివారం విడుదల చేశారు.

పూడికతీతకు నోచుకోని కాలువలు

విడవలూరు: పంట కాలువల్లో పూడికతీతను సక్రమంగా చేపట్టకపోవడంతో పంట చేతికొచ్చే సమయానికి ఎండిపోతోందని వావిళ్ల, గాదెలదిన్నెకు చెందిన రైతులు వాపోయారు. ఈ మేరకు ఆదివారం గుంజి శ్రీనివాసులు, శివ మాట్లాడారు. ఉపాధి పనుల్లో భాగంగా వావిళ్లలో పంట కాలువలను ఎంచుకోకపోవడం.. పనులను సక్రమంగా చేపట్టకపోవడంతో కొద్దికాలంలోనే గడ్డి పెరిగిపోయి, నీటి పారుదలకు ఆటంకం ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను పరిష్కరించేలా చూడాలని కోరారు.

రైల్లోంచి పడి యువకుడి మృతి



కొడవలూరు: రైల్లోంచి జారిపడటంతో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని తలమంచి రైల్వేస్టేషన్ సమీపంలో ఆదివారం చోటుచేసుకొంది. రైల్వే ఎస్సై వెంకట్రావు వివరాల మేరకు.. తలమంచి రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తుతెలియని రైల్లోంచి జారపడి జార్ఖండ్‌కు చెందిన నోవల్ టప్నో (45) అక్కడికక్కడే మృతి చెందారు. కుటుంబసభ్యులకు సమాచారమిచ్చారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైతులకు విరివిగా రుణాలు

నెల్లూరు(అర్బన్): రైతులు, వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు తదితరులకు రుణాలను విరివిగా అందిస్తున్నామని బ్యాంక్ ఆఫ్ ఇండియా, విజయవాడ జోనల్ మేనేజర్ బంగార్రాజు పేర్కొన్నారు. బ్యాంక్ వార్షికోత్సవ వేడుకలను ముత్తుకూరు రోడ్డులోని ఓ కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించారు. విద్యార్థులకు నోట్ పుస్తకాలను అందజేశారు. అనంతరం పలువురు సీనియర్ కస్టమర్లను సత్కరించారు. జోన్ డిప్యూటీ మేనేజర్ మహంతి, నెల్లూరు బ్రాంచ్ చీఫ్ మేనేజర్ సందీప్‌రాజు, నాగేశ్వర్, సాగర్ పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలని డిమాండ్



మాట్లాడుతున్న రాజగోపాల్

పొదలకూరు: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని సీపీఎం మాజీ జిల్లా కార్యదర్శి చంద్ర రాజగోపాల్ డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం ప్లీనరీ నిర్వహించారు. ఇందులో పాల్గొన్న రాజగోపాల్ మాట్లాడుతూ కేంద్రం ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి నెరవేర్చలేదన్నారు. విశాఖ ఉక్కు, పోర్టులను నీరుగార్చినట్టు తెలిపారు. లాభాల్లో ఉన్న రైల్వే, విమానయాన, రక్షణ రంగాలను ప్రైవేట్ సెక్టార్లకు అప్పగిస్తున్నట్టు దుయ్యబట్టారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఒక్క హామీను కూడా సక్రమంగా అమలు చేయడం లేదన్నారు. 17 మెడికల్ కాలేజీలను ప్రైవేట్‌కు అప్పగించడం వంటి పనులకు పాల్పడుతున్నట్టు పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రైవేట్ బీమా కంపెనీలకు అప్పగించడం దారుణమన్నారు. ఇక్కడి ఎమ్మెల్యేలు ప్రజాసేవ మరచి సంపాదనలో పడినట్టు విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 9న ధాన్యంకు మద్దతు ధరలు కల్పించాలని నెల్లూరు నగరంలో సీపీఎం నిర్వహించే ర్యాలీలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు బి.మనోహర్, గుడి మణి, రంగయ్య, గౌరీ, అల్లాడి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వేగంగా రామాలయ నిర్మాణం

- రూ.1.25 కోట్లతో పనులు
- వివిధ ప్రాంతాల నుంచి దాతల సహకారం



బేస్ లెవల్ వరకు జరిగిన పనులు

పొదలకూరు: శ్రీరామ నవమి వేడుకల్లో బహత్తర కార్యక్రమానికి భక్తులు శ్రీకారం చుట్టారు. దశాబ్దాలుగా ఉన్న రామమందిరం శిథిలమై పోతుండటంతో దాని స్థానంలో సీతారాముల ఆలయం నిర్మించేందుకు సంకల్పించారు. ఇందుకోసం గ్రామ పెద్దలు తీర్మానం చేసి భక్తుల మనోభావాలను తెలుసుకుని అందరూ ముక్తకంఠంతో రామయ్యకు దేవాలయాన్ని నిర్మిద్దామని పనులు ప్రారంభించారు. ప్రస్తుతం అవి శరవేగంగా జరుగుతున్నాయి. తిరుపతికి చెందిన స్థపతికి ఆలయ నిర్మాణ పనులను అప్పగించారు. దేశ విదేశాలు, వివిధ ప్రాంతాల నుంచి సైతం దాతలు స్పందించి విరాళాలు ప్రకటిస్తున్నారు.

ఎన్నో సంవత్సరాల క్రితం..

పొదలకూరు పట్టణం నడిబొడ్డులో 1936వ సంవత్సరంలో రామమందిరాన్ని నిర్మించారు. అప్పటి నుంచి రంగులు వేయిస్తూ నవమి వేడుకలను నిర్వహిస్తున్నారు. ఎంతో చరిత్ర కలిగి మందిరంలో ప్రతినిత్యం ధూపదీప నైవేద్యాలతోపాటు, భక్తులు రామ సంకీర్తనలను ఆలపిస్తుంటారు. ఉన్న చిన్నపాటి స్థలంలోనే సుమారు రూ.1.25 కోట్లు వెచ్చించి రామాలయాన్ని నిర్మించుకోవాలని తీర్మానంలో పొందుపరచారు.

పూర్తిగా రాతి కట్టడం

రామాలయం పూర్తిగా రాతి కట్టడమేనని ఆలయ నిర్మాణ కమిటీ వెల్లడించింది. రాళ్లను బయటి ప్రాంతాల నుంచి తెప్పించి స్థపతి ఆదేశాల మేరకు కూలీలు చెక్కి ప్రస్తుతం బేస్ లెవల్‌కు పనులను తీసుకొచ్చారు. వీలైనంత త్వరగా పూర్తి చేసి ఆలయంలో విగ్రహాలను పునఃప్రతిష్ఠ చేసేందుకు నిర్మాణ కమిటీ వడివడిగా అడుగులు వేస్తున్నారు.

వేగంగా పనులు



రామాలయ నిర్మాణ పనులు వేగం అందుకున్నాయి. దాతల సహకారం కూడా లభిస్తోంది. వచ్చే శ్రీరామ నవమికి పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నాం. ఇంకా దాతలు ముందుకొస్తే పనులు మరింత వేగం అందుకుంటాయి.

– కోనం చినబ్రహ్మయ్య

దశాబ్దాల కల



రామాలయాన్ని నిర్మించాలని దశాబ్దాలుగా కలలు కనేవారం. రామమందిరం శిథిలావస్థకు చేరుకోవడంతో పనులను చేపట్టడం జరిగింది. మా పెద్దల నుంచి పార్వేట ఉభయకర్తలుగా వ్యవహరిస్తున్నాం.

– ప్రసాద్

గ్రహణంతో ఆలయాల మూత

ఇందుకూరుపేట: చంద్ర గ్రహణం సందర్భంగా మండలంలోని చాముండేశ్వరిదేవి అమ్మవారి ఆలయాన్ని ఆదివారం మూసేశారు. సోమవారం ఉదయం సంప్రోక్షణ అనంతరం పూజలను యథావిధిగా నిర్వహించనున్నారు.

⇨ పొదలకూరు: సంపూర్ణ చంద్రగ్రహం సందర్భంగా పట్టణంలోని ఆలయాలను ఆదివారం ఉదయం 11:30 గంటలకు మూసివేశారు. స్థానిక శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానాన్ని సోమవారం ఉదయం 6:30 గంటలకు యథావిధిగా తెరుస్తామని అర్చకులు తెలిపారు.

⇨ మనుబోలు: మండలంలోని పలు దేవాలయాలను ఆదివారం సాయంత్రం మూసివేశారు.

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని మల్లికార్జున సమేత కామాక్షితాయి ఆలయాన్ని మధ్యాహ్నం ఒంటి గంటకు మూసేశారు. ఆలయ శుద్ధి, సంప్రోక్షణ, స్వామి, అమ్మవార్లకు నిత్య కైంకర్యాల అనంతరం దర్శనానికి సోమవారం అనుమతించనున్నామని ఈఓ అర్చభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి తెలిపారు.



ఇందుకూరుపేట: మూతబడిన చాముండేశ్వరిదేవి ఆలయం



పొదలకూరులోని వెంకటేశ్వరస్వామి ఆలయం



మనుబోలు: మూతపడిన విష్ణాలయం

సీతారామ్ ఏచూరి ఆశయాలను కొనసాగిద్దాం

కోవూరు: సీపీఎం నేత సీతారామ్ ఏచూరి ఆశయాలను కొనసాగిద్దామని పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మోహన్‌రావు పేర్కొన్నారు. పట్టణంలో ఆదివారం నిర్వహించిన సీతారామ్ ఏచూరి వర్ధంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ కార్మికులు, రైతులను ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయని ఆరోపించారు. తొలుత ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. జక్కా శేషమ్మ, గండవరపు శేషయ్య, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మోహన్‌రావు

జేవీవీ జిల్లా మహాసభ

నెల్లూరు(టౌన్): జన విజ్ఞాన వేదికకు తెలుగు ప్రజలతో విడదీయరాని బంధం ఉందని జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ పేర్కొన్నారు. అన్నమయ్య సర్కిల్‌లోని యూటీఎఫ్ భవనంలో జేవీవీ జిల్లా మహాసభలను ఆదివారం నిర్వహించారు. పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం జేవీవీ ఆర్థిక నివేదికను అందజేశారు. జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా కాలేషాబాషా, కామయ్య, పెంచలయ్య, అధ్యక్షుడిగా చలపతి, కార్యదర్శిగా విజయకుమార్, కోశాధికారిగా బుజ్జయ్యతోపాటు 30 మంది సభ్యులను ఎన్నుకున్నారు. చొప్పా రవీంద్రబాబు, మాజీ రాష్ట్ర కార్యదర్శి శంకరయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, విద్యాచరణ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గేయానంద్